



ఖరీఫ్‌కు ప్రణాళిక సిద్ధం

- పెరగనున్న పత్తి సాగు విస్తీర్ణం
- 4,33,300ల ఎకరాల సాగుకు సన్నద్ధం
- పత్తి పంటదే సింహ భాగం
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న కర్షకులు

ముథోల్, మే 22 : వానాకాలం సాగుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. గత సంవత్సరం చీడపీడల తెగుళ్లతో మొక్కజొన్న, వరి తదితర పంటలు దెబ్బతిని దిగుబడులు రాక కర్షకులకు కొంత మేరకు నష్టం కలిగాయి. అయితే ఇక రాబోయే వర్షాకాలంలో జిల్లాలో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేసి రైతులను అభివృద్ధి దిశన నడిపించాలని ఉద్దేశంతో అధికారులు పక్కా ప్రణాళికను రూపొందించారు. జిల్లాలో ఖరీఫ్ 2024 సాగుప్రణాళికను ఖరారు చేసి రైతుల సాగుకు సన్నద్ధపరుస్తున్న విషయంపై ఆంధ్రజ్యోతి కథనం.

జిల్లాలో సాగు పరిస్థితి

జిల్లాలో ఖరీఫ్‌కాలంలో 4,33,300ల ఎకరాల వివిధ పంటలను సాగు చేసేందుకు వ్యవసాయశాఖ పక్కా ప్రణాళికలు రూపొందించింది. కావాల్సిన ఎరువులు, విత్తనాలు ప్రైవేట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ తెలిపారు. 2024 ఖరీఫ్‌లో పత్తి 1,68,000 ఎకరాలు, వరి 1,35,00ల ఎకరాలు, సోయాబీన్ 1,01000ల ఎకరాలు, మొక్కజొన్న 18,000ల ఎకరాలు, కంది 10,000ల ఎకరాలు ఇతర పంటలు వేయి ఎకరాలు సాగు చేసేందుకు వ్యవసాయశాఖ ప్రణాళికలను రూపొందించింది.



పసుపు (ఫైల్)

ఈ ఏడు కూడా పత్తిదే సింహ భాగం

జిల్లాలో ఈ ఖరీఫ్‌సాగులో కూడా పత్తిపంటనే సింహభాగంగా చెప్పుకోవచ్చు. గత ఖరీఫ్‌లో జిల్లాలో 1,40,000ల ఎకరాల పత్తిసాగు విస్తీర్ణం ఉంటే ఈ ఖరీఫ్‌సీజన్‌లో 1 లక్ష 68 వేల ఎకరాల వరకు పత్తిసాగు అయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలుపుతున్నారు. గత సంవత్సరం కంటే ఈఏడు 20 వేల ఎకరాలు అదనంగా పత్తి పంటసాగు పెరుగనున్నట్లు పేర్కొంటున్నారు. అలాగే రెండోస్థానంలో వరిపంట మూడోస్థానంలో సోయా విస్తీర్ణం ఉంటుందని తెలుస్తుంది.

అందుబాటులో ఎరువులు

జిల్లాలో 4,33,300 వివిధ రకాల పంటలసాగుకై అవసరమగు ఎరువులు, విత్తనాలు ప్రైవేట్ ద్వారా అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్ తెలిపారు. పత్తి విత్తనాలు 1,710 క్వింటాళ్లు, వరి 23,900ల క్వింటాళ్లు, సోయా 25,000ల క్వింటాళ్లు, మొక్కజొన్న 1,440 క్వింటాళ్లు, కంది 360 క్వింటాళ్లు, ఇతర పంటల విత్తనాలు 150 క్వింటాళ్ల విత్తనాలు అన్ని ప్రైవేట్ ద్వారా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే ఎరువులు ఖరీఫ్‌సీజన్ మొత్తానికి కావాల్సిన ఎరువులు సైతం రైతులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొ న్నారు. యూరియా 34,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముండగా ప్రస్తుతం 13,000ల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. డీఏపీ 6,500 మెట్రిక్ టన్నులు అవసరముండగా 2,600ల మెట్రిక్ టన్నులు ప్రస్తుతం అందుబాటులో ఉందని, అలాగే కాంప్లెక్స్ ఎరువులు 12,000ల మెట్రిక్ టన్నులు అవసరముండగా 9,000ల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని మిగతావి సమయం ప్రకారం అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే రైతు భరోసా, రైతు బీమా, తదితర ప్రభుత్వం ఆదేశం ప్రకారం జరుపబడుతాయని వివరించారు.



దుక్కి దున్నుతున్న రైతు.. చేను

రైతులు తప్పనిసరి రశీదు తీసుకోవాలి

వర్షాకాలం సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా సంబంధిత విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణంలో రశీదు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్ పేర్కొన్నారు. వ్యవసాయశాఖ నుంచి లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనప్యాకెట్లు, బస్తాలపై పేరు, గడువుతేదీ వివరాలు తప్పకుండా గమనించాలని, సరిగా సీల్ చేసి ఉన్న బస్తాలు, ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అలాగే రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రశీదు తప్పకుండా తీసుకోవాలి. రశీదుపై విత్తనరకం, గడువుతేదీ, డీలర్ సంతకం తీసుకోవాలి. రైతు సంతకం కూడా ఉండేలా చూసుకోవాలి. సేంద్రియ ఎరువులు కొనుగోలు చేసిన కూడా సంబంధిత డీలర్ దగ్గర తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని పేర్కొన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే ముందు వ్యవసాయశాఖ అధికారి, శాస్త్రవేత్తలు, ఏఈవోల సూచనలు తీసుకోవడం మంచిదన్నారు. ఎవరైనా లూజు విత్తనాలు అమ్మితే కానీ నకిలీ విత్తనాలు అమ్మితే కానీ సంబంధిత వ్యవసాయశాఖ ఏఈవోలకు, ఏవోలకు, పోలీసుశాఖకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

భూమి దుక్కి దున్ని సిద్ధంగా ఉంచాను



ఈ ఖరీఫ్‌కు ఇప్పటికే వ్యవసాయ చేనును దుక్కి దున్ని సిద్ధంగా ఉంచాను. వర్షం పడిన వెంటనే విత్తనాలను విత్తేందుకు సంసిద్ధంగా ఉన్నాను. నాకు ఉన్న పది ఎకరాల భూమిలో పత్తి పంట, కౌలు తీసుకున్న పది ఎకరాలలో సోయా పంట వేసేందుకు సన్నద్ధమయ్యాను. సుమారు రెండు లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. ఇదివరకే వ్యవసాయ చేనులో పత్తి కర్ర తీసి వేసవి దుక్కులు వేసి సిద్ధంగా ఉంచాను.

రాథోడ్ పాండు, రైతు, విట్టోలి తండా

ఘనంగా నరసింహస్వామి జయంతి



భైంసాలో నరసింహస్వామి విగ్రహానికి అభిషేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

భైంసా, మే 22: పట్టణంలోని నరసింహనగర్ కాలనీ పరిధిలో గల నరసింహ స్వామి మందిరంలో బుధవారం నరసింహస్వామి జయంతి వేడుకలు భక్తుల కోలాహలం మధ్య ఘనంగా జరిగాయి. జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు నరసింహ స్వామి విగ్రహాన్ని, ఆలయాన్ని సర్వంగా సుందరంగా ఆలంకరించారు. వేడుకలలో భాగంగా వేకువ జాములో నరసింహస్వామి విగ్రహానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పట్టణ భక్తులతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వేడకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తుల నరసింహనామస్మరణతో నరసింహనగర్ కాలనీ మార్మోగిపోయింది. వేకువ జామున ప్రారంభమైన వేడుకలు భక్తుల కోలాహలంతో సాయంత్రం వరకు కన్నుల పండువగా కొనసాగాయి. గురువారం ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం జరుగనుంది.

కుభీర్ : మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం దేవతామూర్తులకు పంచామృత అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మహిళలు గ్రామస్థులు పెద్దఎత్తున ఆలయానిక చేరుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తు అన్నదానం చేపట్టారు., ఈ కార్యక్రమంలో కనకయ్య, భోజన్న, నరేష్, పోతన్న, గోపాల్, దేవేందర్, శివ కుమార్, నరేష్, సాయికృష్ణ, తదితరులున్నారు.

మహిళ పట్ల అనుచితంగా
ప్రవర్తించిన వ్యక్తికి 3 నెలల జైలు

నిర్మల్ కల్చరల్, మే 22 : మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ తమకు రావాల్సిన అప్పు వసూలు చేసేందుకు నేరస్తుడు పోశెట్టి అనే వ్యక్తి మహిళను తనకోరిక తీరిస్తే చెల్లిస్తానని అనుచితంగా ప్రవర్తించిన కేసులో నేరస్తుడికి 3 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు 2 వేల రూపాయల జరిమానా విధిస్తూ ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఆర్.అజయ్‌కుమార్ తీర్పు నిచ్చారు. బుధవారం కోర్టు సమన్వయ అధికారి సక్రియానాయక్ ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంఘటన 2016 ఫిబ్రవరి 26న చోటుచేసుకుంది. నిందితుడు బాధితురాలి భర్త దాసరి పోశెట్టి వద్ద 10 వేలు అప్పుగా తీసుకున్నాడని ఎన్నిసార్లు అడిగిన తీర్చలేదని తెలిపారు. భర్త డబ్బులు వసూలు చేసుకు రమ్మని చెప్పి ఊరికి వెళ్లగా భార్య మహిళలతో కలిసి వసూలు చేసేందుకు వెళ్లిందన్నారు. నేరస్తుడు బలవంతం చేయబోగా అడ్డుకుందన్నారు. ఆమెను బూతులు తిడుతూ గాయపరిచాడని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారని, నేరస్తుడిని అరెస్టు చేసి రిమాండ్ చేశారన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.రామకృష్ణ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైందని తెలిపారు.

'ఎన్నికల్లో పాల్గొన్న అధికారులకు అదనంగా చెల్లింపులు చేయండి'

నిర్మల్ కల్చరల్, మే 22 : పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన సెక్టోరియల్ అధికారులు, ఆపై స్థాయి ఉన్నతాధికారులకు ఒక నెల మూల వేతనం చెల్లించాలని పీఆర్టీయూ నాయకులు బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. పోలింగ్ సిబ్బందికి రెండు రోజుల ట్రైనింగ్, 3 రోజులు పనిదినంగా మొత్తం 5 రోజుల గౌరవ భృతితో పాటు డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు.

మున్సిపల్ ఉద్యోగాల
అక్రమాల వ్యవహారంలో కమిషనర్ సస్పెన్షన్

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన
- సస్పెన్షన్ ఉత్తర్వుల్లో ఆంధ్రజ్యోతి కథనాన్ని ఉటంకించిన అధికారులు

నిర్మల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పురపాలక సంఘంలో జరిగిన పబ్లిక్‌హెల్త్ వర్కర్ల నియామకాలకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదుల నేపథ్యంలో అప్పటి మున్సిపల్ కమిషనర్ బి. సత్యనారాయణరెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. 2022 సంవత్సరంలో చివరిగ్రేడ్ ఉద్యోగాలు అయిన పారిశుధ్య కార్మికుల నియామకాలకు సంబంధించి 44 పోస్టులను భర్తీ చేశారు. ఈ వ్యవహారంపై అప్పుడే ఆంధ్రజ్యోతిలో అడ్డదారిలో ఊదేశారు పేరిట పరిశోధనాత్మక కథనం ప్రచురితమైంది. ఈ పోస్టుల భర్తీ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఎంప్లాయిమెంట్ కేంద్రం ద్వారా కేవలం ఏడవ తరగతి చదివిన అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉండగా డిగ్రీ, పీజీలు, ఇంజనీరింగ్ లాంటి ఉన్నత చదువులు చదివిన వారిని ఈ ఉద్యోగాలకు ఎంపిక చేయడం వివాదానికి దారితీసింది. అలాగే పలువురు కౌన్సిలర్ల కుటుంబ సభ్యులు బంధువులను కూడా ఈ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపింది. దీంతో ఉద్యోగాలను రద్దు చేస్తున్నట్లు అప్పటి కలెక్టర్ ప్రకటించారు. అయితే కొందరు దీనిపై హైకోర్టుకు కూడా వెళ్లారు. ఉద్యోగాల భర్తీ విషయంలో పాటించిన నిబంధనలు తీసుకున్న చర్యలపై రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్ అప్పటి కమిషనర్ సత్యనారాయణరెడ్డికి మెమో జారీ చేశారు. దీనిపై ఆయన వివరణ అనంతరం రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్ తాజాగా అప్పటి కమిషనర్ సత్యనారాయణరెడ్డిపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్లో ఆంధ్రజ్యోతితో ప్రచురితమైన అంశాన్ని కూడా ప్రస్తావించారు. ఈ వ్యవహారం ఇప్పుడు కలకలం రేపుతోంది.


ABN ఆంధ్రజ్యోతి
అడ్డదారిలో పోస్టులు ఊదేశారు!

ఆంధ్రజ్యోతి మెయిన్‌లో ప్రచురితమైన కథనం ఇదే



సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

ప్రతీ రైతు నుంచి చివరిగింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

- ఆందోళన చెందవద్దు, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు
- నీటి పారుదల శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కొనుగోలు కేంద్రాలను కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్

నిర్మల్ రూరల్, మే 22 : ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని నీటిపారుదలశాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం సోన్ మండలం న్యూ వెల్మల్ బొప్పారం, నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ కాండ్లీలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా...? అని ఆరాతీశారు. ధాన్యం తరుగు ఏమైనా తీస్తున్నారా అని రైతులను ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని సమాధానం ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ... రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని, సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే లారీలలో లోడ్ చేయించి రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు సేవలందించేలా ఏర్పాట్లు ఉండాలని, రైస్‌మిల్లుల వద్ద కూడా ధాన్యం లోడ్‌లతో కూడిన లారీలు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తరలింపులో జాప్యానికి తావు లేకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు, గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల వలన రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, ప్రభుత్వ ప్రకటించిన మేరకు పూర్తిస్థాయిలో మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని భరోసా కల్పించారు. ప్రతి రైతు నుండి చివరిగింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, ఆందోళన చెందవద్దని, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిసిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లావ్యాప్తంగా 228 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1 లక్ష 2,698 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఎక్కడ కూడా తరుగు వంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కేంద్రాల్లో రైతులకు అవసరమైన త్రాగునీరు, టెంట్, క్లీనింగ్ మిషన్, టార్పాలిన్లు, గన్ని బ్యాగ్స్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని జిల్లా అధికారుల వరకు ప్రతి ఒక్కరూ కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించడం, రోజువారీ పురోగతిని సమావేశంలో చర్చించడం జరుగుతుందని ప్రత్యేక అధికారికి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారిని నందిత, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎం శ్రీకళ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఏడీ మార్కెటింగ్ అశ్వక్, డీసీవో నర్సయ్య, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానంద్, అధికారులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భాగ్యరెడ్డి వర్మ
జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

నిర్మల్ కల్చరల్, మే 22 : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్మ చిత్రపటానికి అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, డీఎస్‌వో రాజేశ్వర్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పాలిసెట్ 2024 ప్రవేశపరీక్ష

నిర్మల్ కల్చరల్, మే 22 : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ 2024 పరీక్ష ఈ నెల 24 శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో పరీక్ష నిర్వహణకు 5 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిర్మల్‌లోని పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ బాలురు, బాలికల జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల శాంతినగర్‌తో పాటు సోఫీనగర్‌లోని రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో పరీక్ష నిర్వహిస్తారన్నారు. జిల్లాలో 1946 అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు వివరించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని కోరారు.

ఉద్యోగాల భర్తీలో
అవకతవకలపై విచారణ జరపాలి

నిర్మల్ కల్చరల్, మే 22 : నిర్మల్, భైంసా మున్సిపాలిటీల్లో క్రిందిస్థాయి ఉద్యోగాల భర్తీలో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని బాధితులు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. 2022లో అనర్హులైన వారికి ఉద్యోగాలు ఇచ్చారని నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై ముడుపులు చెల్లించిన వారికే ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రత్యేక అధికారితో విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

నిర్మల్ కల్చరల్, మే 22 : ఇటీవల వర్షాలు కురిసి చల్లబడగా వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. బుధవారం 41.8 డిగ్రీలుగా ఉష్ణోగ్రత నమోదైంది. మంగళవారం 42.9 డిగ్రీలు నమోదైంది. గురువారం 44 డిగ్రీలు, శుక్రవారం వరకు 46.2 డిగ్రీలుగా నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్
పతకాలు సాధించిన అక్షయ్

నిర్మల్ కల్చరల్, మే 22 : ఇటీవల గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ 2024 పోటీ ల్లో పాల్గొని ధ్యావత్ అక్షయ్ బంగారు, వెండి పతకాలు సాధించారు.

ఏసీబీ వలలో భైంసా మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్

- లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ బిల్‌కలెక్టర్ విద్యాసాగర్
- బిల్ కలెక్టర్ సమాచారంతో కమిషనర్ వెంకటేశ్వర్‌రావ్ అరెస్టు

భైంసా, మే 22 : భైంసా మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏసీబీ దాడులు జరిగాయి. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో లంచం తీసుకుంటూ మున్సిపల్ బిల్ కలెక్టర్ విద్యా సాగర్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. బిల్ కలెక్టర్ ఇచ్చిన సమాచారం మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావ్ నిర్మల్ నుంచి భైంసాకు వస్తుండగా దిలావర్‌పూర్ టోల్ ప్లాజ వద్ద అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. కరీంనగర్ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భైంసా పట్టణంలోని పురాణ బజార్ ప్రాంతానికి చెందిన లాలా రాధేశ్యాం అనే వ్యక్తి 2022 సంవత్సరంలో మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతి పొంది భవన నిర్మాణం చేపట్టాడు. అయితే సంబంధిత భవనం అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన్నట్లు గత మూడు నెలలుగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ రావు, బిల్ కలెక్టర్ విద్యాసాగర్‌లు వేధించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తామంటూ నోటిసులు జారీ చేశారు. దీంతో రాధేశ్యాం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి కమిషనర్‌ను కలువగా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలకు రూ. 30వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సంబంధిత నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. బాధితుడు రాధేశ్యాం పలు విధాలుగా వేడుకున్నప్పటికీ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు కనికరించలేదు. త్వరతగతిన లంచం డబ్బులు ఇవ్వకపోతే కూల్చివేతలు తప్పవని బిల్ కలెక్టర్ విద్యాసాగర్ ద్వారా రాధేశ్యాంకు సమాచారం ఇచ్చారు. దీంతో విసిగిపోయిన రాధేశ్యాం ఈ నెల 17న ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు బుధవారం మధ్యాహ్నం వేళలో రాధేశ్యాం లంచం డబ్బులు తీసుకోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్‌రావుకు అప్పజెప్పేందుకు వెళ్లాడు. సంబంధిత డబ్బులను బిల్ కలెక్టర్ విద్యాసాగర్‌కు అందించాలని కమిషనర్ సూచించాడు. దీంతో రాధేశ్యాం రూ. 30వేలను బిల్ కలెక్టర్ విద్యాసాగర్‌కు అందించగా అప్పటికే అక్కడ కాపుకాచి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బిల్ కలెక్టర్ ఇచ్చిన సమాచారం మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావును పట్టుకునేందుకు ఏసీబీ అధికారులు యత్నించగా అప్పటికే ఆయన నిర్మల్‌లో సమావేశం నిమిత్తం వెళ్లారు. సంబంధిత సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు నిర్మల్-భైంసా రహదారిలోని దిలావర్‌పూర్ టోల్‌ప్లాజా వద్ద కాపుకాచి కమిషనర్‌ను అదుపులోకి తీసుకోని భైంసా మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. అనంతరం లంచం తీసుకున్న కేసులో కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, బిల్ కలెక్టర్ విద్యాసాగర్‌లను అరెస్టు చేసి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు తరలిస్తున్నట్లుగా వెల్లడించారు. ఏసీబీ దాడుల్లో సీఐ కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావ్, బిల్ కలెక్టర్ విద్యా సాగర్




స్వాధీనపరుచుకున్న నగదు



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

కరెంట్ కట్‌తో తప్పని తిప్పలు!

ఉట్నూర్, మే 22: ఉట్నూర్ పట్టణంలోని బుధవారం ఉదయం 11 గంటల నుంచి విద్యుత్ అధికారులు కరెంట్ కటింగ్ నిర్వహించారు. మధ్యాహ్నం రెండు దాటుతున్న కరెంట్ రాకపోయేసరికి మండుతున్న ఎండలకు ఉక్కపోతతో ఇటు పిల్లలు, అటు వృద్ధులు ఎంతో ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు సైతం వేసవి ఎండలకు తట్టుకోలేక ఉక్కపోతతో పనులు చేయలేక పోతున్నామని అంటున్నారు. ఈ విషయమై స్థానిక విద్యుత్ అధికారులను ఆరతీయగా.. ఉట్నూర్ పట్టణంలో ప్రధాన విద్యుత్ లైన్ పనులు కాంట్రాక్టర్ ద్వారా నిర్వహిస్తున్నామని పేర్కొంటున్నారు. ఉదయం సమయంలో ఎండ పెరుగక ముందు పనులు చేసినట్లయితే విద్యుత్ కార్మికులకు సైతం బాగుండేదని, ప్రజలకు సైతం ఎండ సమయంలో కరెంట్ సరఫరా ఉండేదని ప్రజలు అంటున్నారు. కాంట్రాక్టర్‌కు ఉదయం సమయంలో ఎల్‌సీ ఇచ్చినప్పటికి సకాలంలో కార్మికులు రాక పోవడంతో పనులు ఎండలోనే చేయాల్సి వచ్చినందున ఎల్‌సీ ఇవ్వాల్సి వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు. నిబంధనలు గాలికి వదిలి, ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు ఎండలో పని చేస్తున్న కార్మికులకు సైతం వడదెబ్బ తగిలి అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం లేకపోలేదని అంటున్నారు. ఈ విషయాలపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పరిశీలకులు అంటున్నారు.



ఇచ్చోడలో ఓ ఇంటి మెట్లపై గుంపులుగా కూర్చున్న కోతులు

ఇంట్లో ఉంటే కోతుల గోల.. వీధిలోకి వెళితే కుక్కల బెడద!!

ఇచ్చోడ, మే 21: చుట్టు చెట్లు.. గుట్టలు.. దట్టమైన అడవుల్లో ఉండాల్సిన కోతులు ఊర్ల మీద పడుతున్నాయి. దీంతో ప్రజలు బెంబెలెత్తి పోతున్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని టీచర్స్‌కాలనీ, ఆశోక్‌నగర్, ఇస్లాంపుర, రంజాన్‌పుర, తదితర ప్రాంతాల్లో ఇళ్లపై దూకుతూ.. తలపులు, కిటికీలు తెరిచి కనిపిస్తే లోపలికి వచ్చి చేతికి అందిన ఆహార పదార్థాలతో ఉడాయిస్తున్నాయి. ఎవరైనా తరిమేందుకు ప్రయత్నించినా.. అడ్డుకున్న దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో మీదపడి గిరడం, కొరకడం, వేళ్లతో గిచ్చి గాయపర్చడం చేస్తున్నాయి. మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో రోడ్డు వెంబడ వెళ్లే ఓ వ్యక్తి కోతులను అడ్డుకోబోయాడు.. అయితే ఆ కోతి అతడిపై దూకి కొరికి గాయం చేసింది. వీటి కారణంగా ఇంటి ముంగిట ఒంటరిగా ఉండాలంటే భయపడాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరోవైపు వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గతంలో ఒకటో రెండో కనిపించేవని, ఇప్పుడు ఐదు నుంచి పది కుక్కలు గుంపులుగా సంచారిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని వాపోతున్నారు. సాయంకాలం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో కుక్కలు గుంపులుగా తిరగుతూ అరుస్తూ మీదకు దూకె ప్రయత్నం చేస్తున్నాయి. ఒంటరిగా వెళ్లాలంటే చేతిలో పొడవటి కట్టె వెంబడి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి కోతులు, కుక్కల బెడద నుంచి తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.



రాత్రుల్లో వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

ఆదిలాబాద్ జిల్లాలో గాలివాన బీభత్సం

● ఉట్నూర్ మండలంలో గాలికి విరిగిపడ్డ చెట్లు ● తెగిపోయిన కరెంట్ తీగలు ● బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు ● తలమడుగు మండలంలో కూలిన ఇళ్లు
● రోడ్లపై విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు ● తాంసి మండలంలో కురిసిన భారీ వర్షం ● విరిగిన విద్యుత్ స్తంభాలు ● నేలకొరిగిన భారీ వృక్షాలు


ఉట్నూర్ మండలం పులిమడుగు సమీపంలో దిగబడ్డ ఆర్టీసీ బస్సు

ఉట్నూర్, మే 22: ఉట్నూర్ మండలంలో బుధవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, భారీ వర్షం భీభత్సవం సృష్టించింది. మండలంలోని కొత్తగూడ, చెక్‌పోస్టు వంతెన సమీపంలో చెట్టు పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచి పోయింది. చెక్‌పోస్టు కొత్తగూడ గ్రామంలో హరీష్ ఇంటి పై కప్పులు లేచిపోయి రవినాయక్ ఇంటి సమీపంలో పడ్డాయి. అదేవిధంగా కరెంట్‌తీగలు తెగిపడడంతో విద్యుత్ ప్రమాదం జరుగకుండా గ్రామానికి చెందిన టీచర్ రవినాయక్ విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. కొత్తగూడ వంతెన వద్ద చెట్టు పడిపోవడంతో ట్రాపిక్ నిలిచి పోగా ప్రజలు ముందుకు వచ్చి చెట్టు కొమ్మలు కుట్టివేయడంతో గంటపాటు స్పందించిన రాకపోకలు ఐదున్నర గంటలకు ప్రారంభమయ్యాయి. ఇదిలా ఉండగా మండలంలోని పులిమడుగు సమీపంలో ప్రధాన రహదారి పై చెట్టు పడి పోవడంతో పక్కనుంచి బస్సు తీయడానికి ప్రయత్నించిన ఆదిలాబాద్ నుంచి కాళేశ్వరం వెళ్తున్న బస్సు బురదలో కూరుకుపోయింది. ఫలితంగా ట్రాఫిక్ నిలిచి పోయింది. సాలెవాడ, తాండ్ర గ్రామాలలో ఈదురు గాలులకు పైకప్పులు లేచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉట్నూర్ పట్టణానికి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సమీపంలో లోలెవల్ రోడ్డు వద్ద భారీ వర్షానికి రోడ్డు పై నుంచి నీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

తలమడుగు: మండుటెండల్లో ఉన్నట్టుండి బుధవారం మండలంలోని గిరిజన గ్రామాల్లో మిట్ట మధ్యాహ్నం ఉరుములతో కూడిన గాలివాన భీభత్సవంతో జనజీవనం అతలాకుతలమయ్యాయి. గాలివాన బీభత్సంతో చెట్టు విరిగి పడి ఇళ్లపై పడడంతో గిరిజనులు పూర్తి గుడిసెలు నేలమట్టమయ్యాయి. అంతేకాకుండా ఇంట్లోని తినుపదార్థాలు సామగ్రి తడిసి ముద్దాయయని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి తలమడుగుతో పాటు ఝరి, పూనగూడ, ఉమ్రికోసాయి దేగామ, కప్పర్‌దేవి, పల్సిబి తాండ పల్సి(కె) తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి పలు ఇళ్లు కూలిపోయాయి. అంతేకాకుండా ఇంటి పైనున్న ఇనుప రేకులు గాలికి లేచిపోయి పశువులకు తగలడంతో పశువులకు గాయాలయ్యాయి. పొన్నగూడ గ్రామంలో విద్యుత్ స్థంబాలు విరిగి పోవడంతో ఆదివాసులు ఆందోళన గురయ్యారు. విద్యుత్ స్థంబ మెరిగిన సమయంలో కరెంట్ లేక పోవడంతో పెద్దప్రమాదం తప్పిందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. గాలివాన బీభత్సంతో నష్టపోయిన బాధితులందరికి ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలని గిరిజనులు కోరుతున్నారు. కాగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడడంతో కొత్తవేడి నుంచి ఉపశమనం లభించిందని మండల వాసులు వాపోతున్నారు.


కొత్తగూడెం వంతెన వద్ద విరిగిపడ్డ చెట్టు


ఈదురుగాలికి శ్రీహరి ఇంటిపై నుంచి లేచిపోయిన కప్పు


కొత్తగూడెంలో ఇళ్లపై పడ్డ కరెంట్ తీగలు

నేరడగొండ: గాలివాన బీభత్సం నేరడిగొండ మండలంలో బుధవారం ఒక్కసారిగా గాలివాన కురవడంతో గాలికి పలువురికి ఇంటి పై కప్పులు లేచిపోయాయి.చెట్లు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇస్పూర్ గ్రామానికి చెందిన పెళ్లగంగసింగ్ ఇంటి పై కప్పులు ఎగిరి పోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.



నేరడగొండ మండలంలో వాంకిడి వంతెన వద్ద పడ్డ భారీ వృక్షం, వాహనదారుల ఇక్కట్లు

తాంసి: మండలంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ స్తంభాలు విరిగిపడి పోగా పెద్ద పెద్ద వృక్షాలు సైతం నేలకొరిగాయి. పూరి గుడిసెలు, ఇల్లపై కప్పులు పరిస్థితి అయితే మరింత దయనీయంగా ఉంది. భయంకరమైన శబ్దాలతో ఉరుములు, మెరుపులు వీయడంతో జనం భయ బ్రాంతులకు గురయ్యారు. తాంసి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు వద్ద జొన్నలన్నీ తడిసి ముద్దాయి. ముఖ్యంగా కరెంట్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పంట చేలల్లో కొద్దిపాటి నష్టం వాటిల్లినప్పటికీ ఈ వర్షం రైతులకు కొంత ఊరటనిచ్చిందని అంటున్నారు. మొత్తం మీద ఈదురు గాలితో కూడిన వర్షం భారీ నష్టాన్ని కలిగించినట్లు అయ్యిందని పలువురు పేర్కొంటున్నారు.

● బోథ్‌లో జొన్న పంటకు నష్టం

బోథ్: మండలంలో బుధవారం సాయంత్రం ఈదురుగాళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది మండలంలోని సుర్దాపూర్, కంటేగా, మరల పెళ్లి, నిగిని తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది ఫలితంగా చేతికందే జొన్న పంట నేలపాలైంది. తడిసిన జొన్నలతో రైతులకు నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. కాగా అనేక గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలపై పడగ, చెట్లు విరిగిపడ్డాయి.


తాంసి మండలంలో వడ్డాడి గ్రామ సమీపంలో విరిగిపడ్డ 33/11 కేవీ విద్యుత్ స్తంభం


బోథ్ మండలంలో కురుస్తున్న వర్షం


మరలపెల్లిలో గాలికి విద్యుత్ స్తంభంపై పడ్డ రేకులు


తలమడుగు మండలంలో కురిసిన భారీ వర్షానికి విరిగిపడ్డ చెట్టు


రోడ్డుపై విరిగిపడ్డ విద్యుత్ స్తంభం


ఇల్లు కూలిపోవడంతో రోడ్డున పడ్డ గిరిజన కుటుంబం

ఎన్నికల హామీలు అమలు చేయాలి : సీపీఎం

నిర్మల్ కల్చరల్, మే 22 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. బుధవారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ... ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500ల బోనస్ చెల్లిస్తామని ప్రకటించి ఇప్పుడు సన్న వడ్లకే అనడం సరికాదన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందన్నారు. ఇప్పటికే సన్న వడ్ల రైతులు ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాల్‌కు రూ. 3600లకే అమ్ముతున్నారని బోనస్ చెల్లిస్తామనడం వారిని మోసం చేయడమే అన్నారు. ఆరు నెలలు కాకుండానే హామీలను కాంగ్రెస్ మరిచిపోయిందన్నారు. మహిళలకు రూ. 2500ల పెన్షన్, 15 వేల రైతు భరోసా తదితర హామీలు ఎప్పుడు నెరవేరుస్తారని ప్రశ్నించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. తిరుపతి, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రతీ ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో చదవాలి'


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, మే 22 : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్యాల పాఠశాలలో ప్రవేశం కొరకు ఉపాధ్యాయులు చిట్యాల గ్రామంలోని పెద్ద చెరువు కట్ట వద్ద గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న గ్రామ ప్రజలకు ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు గజపల్లి నర్సయ్య మాట్లాడుతూ... పాఠశాలలో ఆరవ తరగతిలో ఇంగ్లీష్ మీడియం ప్రారంభించడం జరుగుతుందని, ఉన్నత విద్యార్హతలు, అత్యంత అనుభవం కలిగి అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నారు. స్మార్ట్ క్లాస్‌ల నిర్వహణతో పాటు వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని, అంతేకాకుండా విద్యార్థులకు రెండు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, కాపీలతో పాటు మధ్యాహ్న భోజనంలో పుష్టికరమైన ఆహారం అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. మీ పిల్లలను మా పాఠశాలకు పంపితే వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత మాదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్ రెడ్డి, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

● పీఆర్టీయూ నేత పర్వతి సత్యనారాయణ

నిర్మల్ కల్చరల్, మే 22 : తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 317 జీవో, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. పీఆర్సీ సవరణ, 51 శాతంతో స్థిరీకరణ, నేషనల్ ఇంక్రిమెంట్లు కమిషనర్ శివశంకర్‌కు ప్రాతినిధ్యం చేశామన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై. సాయన్న, హరిప్రసాద్, ఎస్. శ్రీనివాస్, రవిరాజ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

లక్ష్మణచాంద, మే 22 : సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని పొట్టపెలి (కే) గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఎలాంటి వివరాలు అడిగినా స్పందించవద్దన్నారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల పట్ల, ఓటుహక్కు విని యోగం పైఅవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా వ్యక్తులు ప్రజాశాంతికి భంగం కలిగేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకొని, బైండోవర్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

మంత్రి సీతక్కను కలిసిన ట్రిపుల్ ఐటీ గెస్ట్ లెక్చరర్లు


మంత్రికి సమస్యలను విన్నవిస్తున్న ట్రిపుల్ ఐటీ గెస్ట్ ఫ్యాకల్టీ

బాసర, మే, 22 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి అనసూయ సీతక్కను బుధవారం బాసర ట్రిపుల్ ఐటీ గెస్ట్ లెక్చరర్లు కలిసి తమ సమస్యలను విన్నవించారు. హైదరాబాద్ సెక్రటరీయేట్‌లో కలుసుకొని తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రతీ సెమిస్టర్‌కు ఇంటర్వ్యూలు నిర్వహించి తమకు మానసికంగా ఉద్యోగ అభద్రతా భావం కలిగించేలా అధికారులు వ్యవహరిస్తున్నారని చెప్పారు.

2018 నుంచి పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు, గెస్ట్ ల్యాబ్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు సమానంగా ట్రిపుల్ ఐటీ విద్యాబోధనలో 120 మంది తమ బాధ్యతలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆటో రెన్యూవల్ విధానంలో కొనసాగించాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

● నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్


మస్కాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

ఖానాపూర్, మే 22 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఖానాపూర్ మండలంలోని బాధనకుర్తి, మస్కాపూర్, సుర్జాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయవద్దని సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. 18 శాతం తేమ కలిగి ఉన్న ధాన్యాన్ని వెనువెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. స్థానిక తహసీల్దార్ శివరాజ్, ఏఎంసీ కార్యదర్శి సయ్యద్ ఆజాం అలీ, తదితరులున్నారు.

'సరైన సౌకర్యాలు లేకుండా పాఠశాల ఏర్పాటు సరికాదు'

ఖానాపూర్, మే 22 : ప్రైవేట్ పాఠశాల ఏర్పాటుకు కావలసిన సౌకర్యాలు లేకుండానే కడెం మండల కేంద్రంలో ఓ పాఠశాల ఏర్పాటు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు సరికావని కడెం ఎంపీపీ అలెగ్జాండర్ అన్నారు. బుధవారం కడెంలోని హరిత రిసార్ట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటివరకు పాఠశాల ఏర్పాటు కోసం ఎటువంటి అనుమతులు రాకముందే ప్రచార ఆర్భాటాలు చేయడం సరికాదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టేందుకు కరపత్రాలను ముద్రించి వాటిపై పాఠ శాల ఫోటోలను గ్రాఫిక్‌లో తయారు చేసి ప్రచారం చేయడం సరి కాదన్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న పాఠశాల భవనానికి కరపత్రాలపై ముద్రించిన పాఠశాల భవనానికి ఎటువంతి పొంతన లేదనే విషయాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి గమనించాలన్నారు. మంచిర్యాల జిల్లాకు చెందిన వ్యక్తి అక్కడ నడుపుతున్న తన పాఠశాలల పేరిట కడెం మండల కేంద్రంలో సైతం పాఠశాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం పాఠశాలను ఏర్పాటు చేసి విద్యా ర్థులకు నాణ్యమైన విద్యను అందిస్తే బాగుంటుందని ఇటువంటి మోసపూరిత ప్రకటనలు చేసి అమాయకులైన ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తే ఊరుకునేది లేదన్నారు. జిల్లా స్థాయి అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు ముట్ట జెప్పేందుకు సదరు వ్యక్తి ప్రయత్నిస్తూ ఎటువంటి సౌకర్యాలు లేకుండా పాఠశాలకు అనుమతి పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించిన సదరు పాఠశాలకు అనుమతిస్తే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు పిర్యాదు చేస్తామన్నారు.

అందుబాటులో

సోయా, కంది విత్తనాలు

ముథోల్, మే 22 : మండల కేంద్రమైన ముథోల్‌లోని వ్యవసాయ పరిశోధనా స్థానం, ఏరువాక కేంద్రంలో సోయా విత్తనాలు, కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ కార్తీక్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విత్తనాలను ఈ నెల 24వ తేదీ నుంచి విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. కంది విత్తనాలు రకం డబ్ల్యూఆర్‌జీ97, హనుమ టీడీఆర్‌డీ-4 విత్తనాలు (4 కిలోలు) బస్తా ధర రూ. 600, ఆరు కేజీల బస్తా ధర రూ. 900లకు విక్రయించడం జరుగుతుందన్నారు. సోయా బీన్ బాసర అనే రకం 25 కేజీల బస్తా ధర రూ. 2750లకు లభిస్తుదన్నారు. రైతులు నేరుగా ముథోల్ వ్యవసాయ పరిశోధనా స్థానంకు వచ్చి కొనుగోలు చేసుకోవచ్చన్నారు. దూర ప్రాంత రైతులు తమ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తే రైతులకు దగ్గరలో ఉన్న ట్రాన్స్‌పోర్ట్‌కు పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగతా వివరాలకు శాస్త్రవేత్త డా. విజయ్ కుమార్ సెల్ నెంబర్ 7337399462కు సంప్రదించాలన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన

వ్యవసాయ సహాయ సంచాలకులు

నర్సాపూర్(జి), మే 22 : మండలంలోని రాంపూర్, నందన్ గ్రామాలలో డీసీఎంస్, ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ సహాయ సంచాలకులు వినయ్‌బాబు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి భాగ్యలక్ష్మి, రమ్య, సెంటర్ ఇన్‌చార్జి రవి, ప్రవీన్, సీసీ ముత్యంలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


శంకర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీహరిరావు

మామడ, మే 22 : మండలంలోని నల్బుర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త శంకర్‌రెడ్డి మంగళవారం మృతి చెందడంతో వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గతంలో వీఆర్‌వోగా పని చేసిన రోజులను గుర్తు చేశారు. వారి వెంట వైస్ ఎంపీపీ లింగారెడ్డి, మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, నాయకులు రఫీ, బాపయ్య, లింగారెడ్డి, మంగు లింగన్న, నల్కం శేఖర్‌రెడ్డి, నర్సారెడ్డి, రాజు పాల్గొన్నారు.


..పరామర్శించిన బీజేపీ నాయకులు



సారంగాపూర్, మే 22 : మండల కేంద్రంలో గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన భారత బాధిత కుటుంబాన్ని బుధవారం బీజేపీ నాయకులు సత్యనారాయణగౌడ్, వడ్డీ రాజేందర్‌రెడ్డి, కరిపే విలాస్‌లు పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

బోథ్, మే 22: మండల కేంద్రంలో పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవనంలో ఈనెల 24న శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా తమ సంఘ భవనంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి వైద్య శిబిరం కొనసాగుతుందని వారు తెలిపారు. అదేవిధంగా మెడివిజన్ కంటి ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



చేప పిల్లల పంపిణీపై.. నీలినీడలు

- జిల్లాలో మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఉచిత చేప పిల్లల పంపిణీ పథకానికి శ్రీకారం
- వానాకాలం సీజన్ సమీపిస్తున్నా.. సిద్ధం కాని ప్రణాళికలు
- గత సంవత్సరం ఇప్పటికే పూర్తయిన టెండర్‌ల ప్రక్రియ
- నేరుగా నగదు సహాయం అందించాలంటున్న మత్స్యకారులు
- ఈయేడు పథకం అమలుపై అనుమానాలు
- ఈయేడు పంపిణీపై ఊసే లేదు
- ఉచిత చేప పిల్లల పంపిణీ ఉంటుందా? లేదా? అంటూ ఆందోళన
- కాంగ్రెస్ ప్రభుత్వంపై భారీ ఆశలు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 68 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల పరిధిలో 4,230 మంది మత్స్యకార్మికులు

ఆదిలాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఉచిత చేప పిల్లల పంపిణీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కానీ ఈయేడు పథక అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఐదు మాసాలు గడిచిపోతున్నా.. ఇప్పటి వరకు ఉచిత చేప పిల్లల పంపిణీపై ఊసెత్తినట్లే కనిపించడం లేదు. దీంతో పథక అమలుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కనిపించడం లేదు. ప్రభుత్వ ఆదేశాలు లేవంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. అయితే వానాకాలం సీజన్ సమీపిస్తున్న కొద్ది మత్స్యకారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈసారి ఉచిత చేప పిల్లల పంపిణీ ఉంటుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 68 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. గతేడు 240 చెరువులలో కోటి 23లక్షల 26 వేల చేప పిల్లల పంపిణీ చేయడానికి అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో 224 చెరువుల్లో కోటి 18లక్షల 34వేల చేప పిల్లలను పంపిణీ చేశారు. చెరువులు, కుంటల్లో 35-40 ఎంఎం సైజు రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో 80-100 ఎంఎం సైజు చేప పిల్లలను వదిలారు. మొత్తం 68 సొసైటీల పరిధిలో 4230 మంది మత్స్యకార్మికులున్నారు. అలాగే పెంచిన చేపలను మార్కెట్‌కు తరలించి విక్రయించేందుకు వాహనాలు, వలలను సబ్సిడీపై ప్రభుత్వం అందించింది. అయితే కొత్త ప్రభుత్వంపై మత్స్యకారులు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు చేప పిల్లల పంపిణీపై ఊసెత్తక పోవడంతో ఆందోళన వ్యక్తమవుతుంది.

ఎత్తివేసే దిశగా అడుగులు

గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేసే దిశగా అడుగులు వేస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో మార్చి, ఏప్రిల్ మాసంలోనే చేప పిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్లను పూర్తి చేసి సమృద్ధిగా వర్షాలు కురవగానే ఆగస్టు, సెప్టెంబరు మాసాలలో చేప పిల్లలను పంపిణీ చేసేవారు. అయితే ఈసారి మే మాసం గడిచిపోతున్నా.. జిల్లా మత్స్యశాఖాధికారులకు ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలను జారీ చేయలేదు. దీంతో ఉచిత చేప పిల్లల పథకాన్ని కొనసాగిస్తారా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు రానున్నాయి. ఆ తర్వాత పథక అమలుపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ఈసారి పథకాన్ని అమలు చేయడం కొంత కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పథకాన్ని ఎత్తివేసి మత్స్యకారులకు మేలు చేసే విధంగా మరో పథకాన్ని అమలు చేస్తారా? లేదా? ఉచిత చేప పిల్లల పథకాన్ని యథావిధిగా కొనసాగిస్తారా? అనే వివిధ రకాల సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో చేప పిల్లల పంపిణీలో భారీగా అక్రమాలు, అవినీతి జరుగడంతో పథక అమలుపై ప్రభుత్వం పునరాలోచించే అవకాశాలు లేక పోలేదంటున్నారు. జూన్ మాసంలోనైనా టెండర్ ప్రక్రియను పూర్తి చేయకపోతే ఈయేడు ఉచిత చేప పిల్లల పంపిణీ ఉండదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రతియేటా సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు వరకు ఆలస్యంగా చేప పిల్లలను పంపిణీ చేయడంతో సరైన ఎదుగుదల కూడా కనిపించడం లేదంటూ మత్స్యకారులు పేర్కొంటున్నారు.

మత్స్యకారుల కొత్త డిమాండ్

రైతుబంధు పథకం కింద రైతులకు అందిస్తున్న పెట్టుబడి సహాయం మాదిరిగానే మత్స్యకారుల కుటుంబాలకు నేరుగా నగదును అందించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. గతంలో మాదిరిగా ఉచిత చేపపిల్లల పంపిణీ వద్దన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే నాణ్యత లేని చేప పిల్లలను పంపిణీ చేస్తూ కాంట్రాక్టర్లు లక్షల రూపాయలు వెనుకేసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఒకవేళ చేప పిల్లలను చెరువుల్లో వదిలినా.. సరైన సమయానికి ఎదగడం లేదంటూ మత్స్యకారులు పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్లు, అధికారుల అవినీతితో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితులకు తావివ్వకుండా నేరుగా అర్హులైన మత్స్యకారులను గుర్తించి నగదు సహాయాన్ని అందించాలని కోరుతున్నారు. అయితే మత్స్యకారులకు నగదు సహాయాన్ని అందిస్తే ఎక్కువగా దుర్వినియోగమయ్యే అవకాశం ఉందన్న వాదనలు లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో గతంలో అమలు చేసినా.. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని ప్రభుత్వం యథావిధిగా కొనసాగిస్తుందా? లేక కొన్ని మార్పులు చేర్పులు చేస్తూ ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందా? అనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. మత్స్యకారుల డిమాండ్‌లను కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది. త్వరలోనే ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలు ఖరారయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.



నగదు సహాయాన్ని అందించాలి

: భూమన్న, మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు

మత్స్యకార్మిక కుటుంబాలకు ప్రభుత్వం నగదు సహాయాన్ని అందించి ఆదుకోవాలి. కాంట్రాక్టర్లు అవసరమైన చేప రకాలను సరఫరా చేయడం లేదు. దీంతో మత్స్యకారులు నష్టపోవాల్సి వస్తుంది. అలాగే ఆలస్యంగా చేప పిల్లల పంపిణీని చేపట్టడంతో సరైన ఎదుగుదల కనిపించడం లేదు. జూన్, జూలై మాసంలో తొలకరి వర్షాలు కురవగానే చేప పిల్లలను పంపిణీ చేస్తే బాగుంటుంది. మత్స్యకారులకే నగదు సహాయాన్ని అందిస్తే మేలు రకమైన చేప పిల్లల ను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుంది.

ఎలాంటి ప్రభుత్వ ఆదేశాలు లేవు

: వై.సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖాధికారి, ఆదిలాబాద్



చేప పిల్లల పంపిణీపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. గతంలో మార్చి, ఏప్రిల్ మాసంలోనే టెండర్ ప్రక్రియ పూర్తయ్యేది. ఈసారి ప్రభుత్వ ఆదేశాలు లేకపోవడంతో టెండర్ ప్రక్రియ నిలిచిపోయింది. జూన్ మాసంలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తాం. ఎప్పుడు ప్రభుత్వం ఆదేశించినా.. టెండర్లు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.



గాంధీ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న సంఘ సభ్యులు

దుండగులను శిక్షించాలి : ఆర్యవైశ్యులు

భీంపూర్, మే 22: మండలంలోని నిపానిలో ఆటో స్టాండ్ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహాన్ని శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా.. వారిని గుర్తించి అరెస్టు చేయాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం భీంపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకు ముందు గాంధీ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు కొత్తూర్ వార్ రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి కౌటిక్ వార్ రాజు, సభ్యులు హరీష్ కుమార్, సంతోష్, గుండవార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి

ఇంద్రవెల్లి, మే 22: ఉపాధి పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయితీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. దీనిలో భాగంగా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, ఉపాధి పనులు చేస్తున్న కూలీల సంఖ్య, గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనులు, ఇంకా చేయాల్సిన పారిశుధ్య వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు చేయడానికి సమయం తక్కువ ఉందని, ఈ 15 రోజుల్లో ఉపాధి పనుల్లో వేగం పెంచడంతో పాటు కూలీల సంఖ్యను కూడా పెంచాలన్నారు. ఉపాధి పనులపై, ఉపాధి హామీ కూలీలకు కూలి డబ్బులు అందించడంతో, పారిశుధ్యం పనుల్లో జాప్యం చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఎంపీవో జీవన్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయితీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

వారంలో దరఖాస్తులను పరిష్కరించాలి

● కలెక్టర్ రాజార్షిషా ఆదేశం ● పెండింగ్‌లో ఉన్న ధరణి, ప్రజావాణి దరఖాస్తులపై సమావేశం ● పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, మే 22: పెండింగ్‌లో ఉన్న ధరణి, ప్రజావాణి దరఖాస్తులను వారంలోగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా తహసీల్దార్‌లను ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో బుధవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధరణి, ప్రజావాణిలో ఉన్న పెండింగ్ దరఖాస్తులపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ధరణి పోర్టల్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వారంలోగా పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రతీ దరఖాస్తును క్షుణంగా పరిశీలించి అవసరమైతే ఫీల్డ్ ఇన్స్పెక్షన్ చేసి ఆన్‌లైన్‌లోనే కాకుండా ఫైల్స్ రూపంలో కూడా నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. రిపోర్టులను పరిశీలించి సంబంధిత నివేదికలతో పూర్తి స్థాయిలో కలెక్టరేట్‌కు సమర్పించాలన్నారు. అంతేకాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఇందులో మండలాల వారీగా తహసీల్దార్‌లను వారి లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తుల పై సమీక్షించి త్వరగా పూర్తి చేయాలని, జూన్ రెండవ వారంలో ప్రజా ఫిర్యాదుల విభాగం ప్రారంభమవుతుందని ఆ లోపు ఇప్పటి వరకు ఉన్న అన్ని రకాలక పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవో వినోద్, జివాకర్‌రెడ్డి, తహసీల్దార్లు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న జిల్లా, మండల సాయి అధికారులు (మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా)

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : తహసీల్దార్

భీంపూర్, మే 22: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన మండల వ్యవసాయ అధికారి రవీందర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విత్తన షాపు డీలర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్‌లు విత్తన ప్యాకెట్‌లపై ఉన్న లాట్ నెంబర్‌లను ఆయన ఈ సందర్భంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శంకర్, వికల్, శంకర్, మహేష్, సంగీత, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న డీపీఎం

మహిళల ఆర్థికాభివృద్ధికి సీసీలు కృషి చేయాలి : జిల్లా ప్రత్యేకాధికారి

బోథ్, మే 22: మహిళా సంఘాలను మరింత ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో సీసీల పాత్ర కీలకమని ఇందిరాక్రాంతి జిల్లా ప్రత్యేక అధికారి డీపీఎం శేషారావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో వివిధ గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షులతో సమావేశమయ్యారు. దీనిలో భాగంగా ప్రతినెలా తప్పనిసరిగా పొదుపు ఖాతాలను పరిశీలించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. పొదుపుతో పాటు ఆర్థిక అభివృద్ధి కోసం చేపడుతున్న వృత్తి వ్యాపారాలను పరిశీలించాలన్నారు. మరోవైపు ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని, అందులో భాగంగానే మహిళా సంఘాలకు పాఠశాల విద్యార్థుల డ్రెస్సులను కుట్టించి ఇచ్చే బాధ్యతను అప్పజెప్పిందన్నారు. అంతేగాక భవిష్యత్తులో మరిన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను డ్వాక్రా మహిళలకు అప్పజెప్పే ఆలోచనలో ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీవో రమేష్‌తో పాటు ఏపీఎం మాధవ్, సీసీలు, మహిళా సంఘాల అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.

'పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ చూపాలి'

తాంసి, మే 22: ఆయా గ్రామాలలో పారిశుధ్యం పనులను వేగవంతం చేసి పనులపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ రవీందర్ అన్నారు. బుధవారం మండలంలోని పొన్నారి గ్రామంలో చేపడుతున్న పారిశుధ్యం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు సోకకుండా ఉండేందుకు కోసం తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంచినీటి పథకాల్లో తప్పనిసరిగా క్లోరినేషన్ వేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇళ్ల చుట్టూ గాని గ్రామంలో గాని పెంటకుప్పలు, చెత్తాచెదారం లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని అన్నారు. ఈ సందర్భంగా పలు పనులను పరిశీలించారు.

పగలంతా ఎండ... సాయంత్రం వాన

● జిల్లాలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు ● భీంపూర్ మండలంలో 43.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పగలంతా భానుడి భగభగలకు తీవ్రమైన ఎండలు కనిపిస్తున్న సాయంత్రం వేళల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుంది. బుధవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 42.8 కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రత 30.2గా నమోదైంది. అయితే, అత్యధికంగా భీంపూర్ మండలం అర్లి(టి) లో 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఆదిలాబాద్ అర్బన్‌లో 43.5, బేలలో 43.2, జైన్నథ్‌లో 42.8, తాంసిలో 42.0, నేరడిగొండలో 41.8 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచి ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనం సాయంత్రం వేళల్లో వాతావరణం చల్లబడడంతో ఎండల తీవ్రత, ఉక్కపోత నుంచి ఉపశమనం పొందుతున్నారు. అదేవిధంగా సాయంత్రం పలు మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. అమ్మేందుకు సిద్ధం చేసిన జొన్న పంట తడిసిపోయినట్లు బాధిత రైతులు చెబుతున్నారు.





జిల్లాకేంద్రంలో సాయంత్రం వేళ కురుస్తున్న వర్షం

